# రెండో ప్రేమ

ప్రతాప వెంకట సుబ్బారాయుడు

''హలో సార్..''

గార్డెనింగ్ చేస్తున్న రిటైర్డ్ మేజర్ పద్మకాంత్‌గారు- తనని పిలిచిందెవరా? అని ఒక మారు అటు ఇటు చూసి ఎవరు లేకపోవడంతో మొక్కలకు నీళ్ళుపోయసాగారు.

''సార్ ఇక్కడ...''

ఈసారి గొంతు విన్పించిన పక్కింటి డాబామీదకి చూపు సారించాడు. ఆకుపచ్చ ఓణీలో రామచిలుకలా వున్న ప్రియకీర్తి కనిపించింది.

''సార్.. మేము ఈ ఇంట్లోకి కొత్తగా దిగాం. మీతో మాట్లాడాలనుకుంటున్నాను రావచ్చా..'' అంది.

రావచ్చన్నట్టుగా చిన్నగా తలూపి నవ్వాడు.

పద్మకాంత్ సంవత్సరం క్రితం రిటైరయ్యారు. మాంచి ఆరోగ్యంతో.. ధృఢమైన శరీరంతో వుండే పద్మకాంత్‌గార్కి అంత వయసు వుంటుందంటే ఎవరూ నమ్మరు. కాని ఆయన తెల్లని జుత్తు.. బొద్దు మీసాలు చూస్తే నమ్మక తప్పదు. ఇప్పటికీ తెల్లవారు ఝామునే లేచి.. ట్రాక్ పట్టుకుని ఐదారు మైళ్ళు వాకింగ్ చేసి ఇంటి కొచ్చి బ్లాక్ కాఫీ తాగి.. గార్డెనింగ్ చేయడం ఆయన అలవాటు.

ఇరవై ఏళ్ళక్రితం ఆయన భార్య చనిపోయింది. ఆవిడ వున్నప్పుడు కూడా సంసారంలో సుఖప డింది లేదు. పెళ్ళాం బిడ్డలకన్నా వాళ్ళకి డ్యూటీయే ముఖ్యం. అనుక్షణం అంకితమై పోయి చెయ్యాల్సిన బాధ్యతలు వాళ్ళవి. ఆర్మ్‌డ్ సర్వీసెస్‌లో వున్నవాళ్ళకి అది మామూలే! ఆయ నకిద్దరు కొడుకులు. పెద్దకొడుకుని మిలట రీలో చేర్పించాడు. మంచి స్థాయిలోనే వున్నాడు. రెండో కొడుకు పూణేలో ఒక ప్రైవేట్ ఫర్మ్‌లో మేనేజర్‌గా చేస్తున్నాడు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయి.. వాళ్ళు వాళ్ళ జీవితాల్లో బిజీగా వున్నారు.

డిఫెన్స్ కాలనీలో కట్టుకున్న ఇంటిలో మొన్న టిదాకా పెద్దకొడుకుతో హాయిగా ఉండేవాడు.. ఇప్పుడా కొడుకు ట్రాన్స్‌ఫర్ మీద ఢిల్లీ వెళ్ళిపో యాడు. ఆ ఇంటిలో ఒంటరిగా.. ఏకాకిగా వుంటున్నారు పద్మకాంత్‌గారు.

గేటు తీసుకుని లోపలికొచ్చింది ప్రియకీర్తి.

''సార్ మేము కొత్తగా నిన్ననే ఆ ఇంట్లోకి దిగాం. నాకు చుట్టుపక్కల వున్నవాళ్ళని పరి చయం చేసుకుని ఫ్రెండ్‌షిప్ చేయడం అలవాటు. నాపేరు చెప్పలేదు కదూ.. ప్రియకీర్తి. నాకు పెళ్ళి చేయాలని.. గుండెలమీద కుంపటి దింపుకో వాలని మా అమ్మానాన్న తెగ తాపత్రయపడుతూ నన్ను పదిహేనుసార్లు పెళ్ళి పరీక్షకి కూర్చోపె ట్టారు. పదిహేను పెళ్ళిచూపులు. కాని ప్రతి మగాడికి కాబోయే పెళ్ళాం లక్ష్మీదేవిలా బ్యాంక్ బాలెన్స్‌తో రావాలి.. పక్కన రంభలా వుండాలి. మా నాన్నేమో ఆర్డినరీ ఎంప్లాయి. కానులు కుమ్మ రించలేడు. నాదేమో ఏవరేజ్ అందం. అందుకే పెళ్ళిచూపుల పరీక్షలన్నీ ఫెయిలయ్యాను. నాలో నిర్లిప్తత ఆవరించింది. మరీ అలా ఆలోచిస్తూ పోతే డిప్రెస్ అయిపోతానని.. మీలాంటి మంచి వాళ్ళతో స్నేహం చేస్తాను. మీరేం అనుకో రుగా.'' అంది.

స్పష్టమైన తనతో గలగల మాట్లాడిన ఆమెని ఆశ్చర్యంగా చూశారు. ఆమె కలుపుగోలు తనాన్ని మనసులో అభినందించారు.

''అనుకోడానికేముంది? ఒక్కడ్నీ మోనాట నీగా రోజులు గడిపేస్తుంటే నాకూ విరాగ్యానే వుంది. ఒక యంగ్‌లేడీ కంపెనీ నాకు ప్రసాదిం చాడు భగవంతుడు'' అన్నాడు.

మరునాటి రోజు ప్రియకీర్తి ఆయనతో వాకింగ్ కెళ్ళింది. దారంతా అల్లరే... ఆమె అల్లరితో ఆయనా శృతి కలిపారు. దారిలో ''మర్రాళ్ళ ఇప్పుడు ఎక్సర్‌సైజులు చేయడంలేదు. అలాం టిది మీరు ఈ వయసులో ఏక్టివ్‌గా రోజూ పెందలాడే లేచి వాకింగ్ చేయడం.. గార్డెనింగ్ చేయడం.. ఓహ్ మీరు చాలా గ్రేట్ సర్. మీముందు ఇప్పటి యువతరం బలాదూర్. ఇప్పు టికీ మీరు హేండ్‌సమ్‌గా వున్నారు'' అంది.

ఆడపిల్ల పొగడ్త ఆవయసులో కూడా రిటైర్డ్ ఆర్మీమేజర్ ఛాతీ అంగుళం పొంగేలా చేసింది.

ఇంటికొచ్చాక గేటుకి పెట్టిన పేపర్ తీసుకుని ట్రాన్సపరెంట్ పడిలేమీద పద్మారిస్తూ.. ఆటో గడి రింపుతుంటే.. చిన్నపిల్లలా కేరింతలు కొడు తుండే.. ఆయన తన వయసుని మరిచి ఆనం దించారు.

రోజు రోజుకీ వాళ్ళ మధ్య స్నేహం పటిష్ట మయి.. చొరవ పెరగసాగింది.

ఒకరోజు ప్రియకీర్తిని స్కూటర్ వెనకాల కూర్చోబెట్టుకుని సంగీత్ థియేటర్లో ఇంగ్లీషు మూవీకి తీసుకెళ్ళాడు. ఇంటర్వెల్‌లో ఎవడో ''ఒరేయ్ ముసలాడికి దొరకా పిందుగ ఫ్రెండిదోయ్'' అని కామెంట్ చేశాడు వాళ్ళి ద్దరూ కూల్‌డ్రింక్ తాగుతుంటే. పద్మకాంత్ గార్కి కోపమొచ్చింది. వాణ్ణి ఏదో అనబోయేం తలో ప్రియకీర్తి ఆయన్ని చేయిపట్టుకుని బయ టకి లాక్కొచ్చేసింది.

ఇద్దరూ ఇంటికొచ్చాక ''వాడన్నదాంట్లో తప్పే ముంది? మంచి దేహదారుఢ్యంతో.. ఆరో గ్యంతో మిసమిస లాడిపోయే మీరు.. జుత్తుకి డై ఎందుకు వేసుకోరు? జుత్తుకి రంగేసు కుంటే మీరు జస్ట్ ఫార్టీఫైవ్ అవుతారు తెలుసా?'' అంది.


ప్రియకీర్తి మాటలు ఆయన్ని ఆలోచనలో పడే శాయి.

మరునాటి రోజు గోద్రెజ్ హెయిర్ డై నీట్‌గా తలకి రాసుకున్నాడు. ఆయనకి ఒక్కసారిగా యవ్వనం మీదకొచ్చినట్టుగా అనిపించింది. నర నరాన ఉడుకు రక్తం ప్రవహిస్తున్నట్టనిపించింది.

కాస్సేపటి తర్వాత ప్రియకీర్తి వచ్చి ఆశ్చర్యం తో కళ్ళు మరింత విశాలం చేసి చూస్తూ.. ''మీ ముందు పాతికేళ్ళ కుర్రాడు కూడా వెలవెలబో తాడు.. ఎంత హేండ్‌సమ్‌గా వున్నారో'' అంది.

ఆమాట కోసమే ఎదురుచూస్తున్న ఆయన మనసు ఎగిరి గంతులేసింది.

ప్రియకీర్తి పరిచయం ఆయన జీవితంలో ఎన్నెన్నో మార్పులు తీసుకొచ్చింది. అనుక్షణం ఆయన తలపుల్లో ఆమె పురివిప్పి నాట్యం చేసేది. ఆమెతో ఆయన రెండో ప్రేమలో పడ్డాడు. మొదటిసారి- పెళ్ళిచేసుకున్న భార్యను ప్రేమించాడు. ఆవిడ చనిపోవడంతో.. ఒంటరి జీవితం గడపలేకపోయాడు. పెద్దరికం మీదేసు కుని కోర్కెలు చంపుకోగలిగాడు గాని.. స్వార్థ్యంలో భార్య తోడు లేకపోవడం ఒక లోటు. ఎవరూ తీర్చలేని, పూడ్చలేని లోటు. ఏదో నర



కయాతన. ప్రియకీర్తిని ఇప్పుడు ప్రేమిస్తుంటే కోరికలు ఒళ్ళు విరుచుకుంటున్నాయి. ఇన్నాళ్ళూ లేని స్త్రీ సౌఖ్యం కోసం దేహం తపిం చిపోతోంది. ఆమె సమక్షంలో మధురానుభూ తులు ఎన్నో మనసులో ప్రోది చేసుకుంటు న్నాయి. ఆయన జీవితంలో రెండోసారి వసంతం తొంగిచూసింది.

'ఆమెకి పెళ్ళి ఒక సమస్య. తనకి భార్య కావాలి. ఆస్తిని.. అంతస్తుని.. తనని చూసుకో డానికి ప్రియకీర్తి భార్యగా కావాలి. తనంటే ఆమెకి అభిమానం.. ప్రేమ.. ఇంకెన్నెన్నో నిర్వ చించలేని మధురభావాలు.. ఆమెపట్ల తనకీ అంతే.. ప్రేమకి.. పెళ్ళికి వయసు ఒక అడ్డం కాదు. ఈ వయసులో కూడా పెళ్ళిళ్ళు చేసు కున్న వారెందరో వున్నారు. వీలైనంత తొందర్లో ఆమె ముందు ఈ ప్రపోజల్ పెట్టాలి. ఆమె 'ఊ' అంటే.. వాళ్ళ పెద్దవాళ్ళని అప్రోచ్ అవ్వాలి. తన ఆస్తి, వాళ్ళని 'నో' అననివ్వదన్న నమ్మకం తన కుంది. ఆమెతోడు లేకుండా తను జీవించలేడు' మధురమైన ఆలోచనల్లో మునిగి తేలుతున్నాడాయన.

ఆరోజు ఉదయం అంతా ఆమెకోసం ఎదురు చూశాడు. ఆమె రాలేదు. కాలుగాలిన పిల్లిలా డాబా ఎక్కి తిరిగాడు. వాళ్ళింటివైపు చూశాడు. కొన్ని కొత్త ముఖాలు కన్పించాయి. ఆయనకి విషయం అర్థంకాలేదు. డల్‌గా వున్నాడు. ఆయన ప్రియకీర్తి అడిక్ట్ అయిపోయాడు.

చీకటి పడుతుండగా వచ్చింది.

''ఫ్రెండ్.. నిజంగా ఈరోజు నా జీవితంలో మరచిపోలేని రోజు. నాకు కూడా నూటికి నూరు మార్కులేసే పెళ్ళిచూపుల్లో సెలక్ట్ చేసుకు న్నాడో అబ్బాయి. పైగా కానీ కట్నం అక్కర్లే దట. ఆ అబ్బాయి ఎంత అందంగా వున్నాడో.. అంతకన్నా మంచి మనసుంది. ఈరోజు కోసమే నేనింతకాలం నిద్రలేని రాత్రుళ్ళు గడిపాను. అమ్మా నాన్నలతో దురదృష్ట జాతకురాల్నినిపిం చుకున్నాను. మీ స్నేహం నాకు జీవం పోసింది. కష్టాలు మరిచేలా చేసింది. మనసు గాయాన్ని మరిపించింది. ఇంట్లోవాళ్ళు సైతం అక్కున జేర్చుకోకుండా.. సూటిపోటి మాటలతో నన్ను హింసిస్తే.. మంచి స్నేహితుడయ్యారు.. ఆత్మ బంధువయ్యారు. మీలాంటి మంచి తండ్రి నాకుంటే ఎంత బావుండేది' అని ఎన్నిసార్లు అనుకున్నానో.. మిమ్మల్నెప్పుడన్నా నొప్పిస్తే క్షమించండి. వారం రోజుల్లో నా పెళ్ళి వుంది. తప్పకుండా వచ్చి బ్లెస్ చేస్తారు కదూ'' అంది ఆర్ద్రంగా.

ఆయన మనసు భావశూన్యమయింది. కళ్ళలో నిండిన నీళ్ళు కనిపించకుండా అటు తిరిగి నుంచున్నారు.

''నామీద కోపమొచ్చిందా ఫ్రెండ్..'' అంది.

'ఆమెతో స్నేహం చేస్తూ నీ వయసును మరచిపోయావు. నీ కూతురు వయసులో వున్నదాన్ని ఎలా ప్రేమించావు? ఎంత అల్పంగా ఆలోచించావో ఒక్కసారి గుర్తుతెచ్చుకో. నీ వయసు పెద్దదికాబట్టే- అరమరికలు లేకుండా స్నేహం చేసింది. అల్లరి చేసింది. అంత మాత్రానికే పెళ్ళి దాకా వూహించుకోవడం నీ తప్పు' ఆయన్ని మనసు నిలేసింది.

''నీమీద నాకెందుకమ్మా కోపం. ఆనందం మాట పెగలనీయటంలేదు. కళ్ళు ఆనంద భాష్పాలతో నిండిపోయాయి. కంగ్రాట్స్.. విష్ యూ ఎ హేప్పీ మారీడ్ లైఫ్..'' అభినందిం చాడు.

''వస్తాను ఫ్రెండ్. మావాళ్ళు నన్ను భూమ్మీద నిలవనీయడంలేదు. నేనో అదృష్ట జాతకురా ల్నని పొగుడుతున్నారు. నిన్నటిదాకా తిట్టిన నోళ్ళు ఇవాళ పొగుడుతుంటే వినాలనుంది. వింటూ విరగబడి నవ్వాలనుంది. లాట్ ఆఫ్ థాంక్స్ ఫర్ యువర్ ప్రెషియస్ ఫ్రెండ్షిప్..'' అని వెళ్ళిపో యింది.

వెన్నెల వెళ్ళిపోయింది ఆయన జీవితం లోంచి.. చిక్కటి చీకటి గుమ్మరించినట్టు అయి పోయింది ఆయన మనసంతా!

పెళ్ళికి వెళ్ళి గిఫ్ట్ చదివించాడు.. ఆయన జుత్తు తెల్లగా వుంది. మనిషి చాలా కృంగిపోయినట్టు వున్నాడు. మానసికంగా ఆయన కోలుకోడానికి చాలాకాలం పడుతుంది.

★